
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
గురువారం 22 ఆగస్టు 2024



నిత్యం.. నరకం..



రైల్వే గేట్ పడటంతో భారీగా నిలిచిన వాహనాలు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 21: కరీంనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో నిత్యం రద్దీతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రైల్వే గేటు పడితే కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆర్వోబీ పనులు నిలిచి పోయాయి. రహదారి మొత్తం గుంతలమయమైంది. రోడ్డు ఒకే వైపు నుంచి ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే గేటు పడి తెరచిన తరువాత వాహనదారులు నుంచి ఇష్టానుసారంగా వెళ్లడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్ పోలీసులు ఆ ప్రాంతంలో లేక పోవడంతో వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. మంచిర్యాల జిల్లా నుంచి ప్రజలు ఈ రహదారి మీదుగానే కరీంనగర్‌లోకి వస్తుంటారు. అంబులెన్స్‌లూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతుండడంతో అందులో ఉన్న రోగులు ఇబ్బందిపడుతున్నారు. అంత్యవసర పరిస్థితుల్లో సమస్య తీవ్రంగా ఉంటుంది. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రుణమాఫీ కోసం దరఖాస్తుల వెల్లువ



కరీంనగర్ మండలం నగునూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తులు అందిస్తున్న రైతులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 21: మండలంలో పలు కారణాలతో పలువురు రైతులకు రుణమాఫీ కాలేదు. రుణమాఫీ కాని రైతులకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మూడు రోజులుగా రైతుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇప్పటి వరకు 576 మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ రికార్డుల మేరకు కరీంనగర్ మండలంలో 15వేల ఎకరాలు సాగుకు యోగ్యమైన భూమి ఉంది. 11,130 మంది రైతులు ఉన్నారు. ఇందులో ఆరు వేల మందికి పైగా రుణాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు 4,086 మంది రైతులకు 28.68 కోట్ల రూపాయలు రుణమాఫీ జరిగింది. లక్ష రూపాయలలోపు తీసుకున్న 2,370 మంది రైతులకు 12.17 కోట్లు, 1.5 లక్షల వరకు తీసుకున్న 1,143 మంది రైతులకు 9.89 కోట్లు, రెండు లక్షల వరకు 573 మంది రైతులకు 6.56 కోట్ల రూపాయలు రుణమాఫీ జరిగింది. ఇంకా రెండు వేల మంది వరకు లబ్ధి పొందాల్సిన రైతులు ఉన్నట్లు అంచనా. రోజురోజుకు రుణమాఫీ ఫిర్యాదుల దారుల సంఖ్య పెరుగుతోంది. అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు. మండల వ్యవసాయాధికారి సత్యం మాట్లాడుతూ కరీంనగర్ మండలంలో 17 గ్రామాలకు గాను మొత్తం 4,080 మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. ఇప్పటి వరకు 573 మంది తమకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి రోజు ఆన్‌లైన్‌లో రుణమాఫీ కాని రైతుల పేర్లను, కారణాలను నమోదు చేస్తున్నాము.

సమస్యల పరిష్కారం..
అభివృద్ధిపై దృష్టి

- నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- కలెక్టర్, మేయర్‌ను కలిసిన కమిషనర్
- అభివృద్ధి పనులపై చర్చ



బాధ్యతలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 21: సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై దృష్టి పెడతామని కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యాలే ప్రాతిపదికగా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై దృష్టిపెడతామని చెప్పారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఈఈ యాదగిరి, డీఈలు, ఏఈలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారి ఆంజనేయులు కమిషనర్‌కు పూల మొక్కలను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్‌పాయ్ కలెక్టర్ పమేలా సత్పతిని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మేయర్ యాదగిరి సునీల్ రావును క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమొక్కను బహూ కరించగా, మేయర్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా నగర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అభివృద్ధికి సంబంధిం చిన అంశాలను మేయర్ సునీల్‌రావు కమిషనర్‌కు వివరించారు. స్మార్ట్‌సిటీ, ఇతర అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు.

ప్రతి వృద్ధుడికి ప్రాణ, ఆస్తి రక్షణ కల్పించాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 21: జిల్లాలోని ప్రతి వృద్ధుడి ఆస్తిని, ప్రాణాన్ని రక్షించి, వారు గౌరవప్రదమైన జీవితాన్ని అనుభవించేలా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డే కేర్ సెంటర్‌లో జాతీయ సీనియర్ సిటిజన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి వృద్ధుడు గౌరవప్రదంగా జీవించే విధంగా అన్ని విధాలా భద్రత కల్పించాల్సిన బాధ్యత, అధికారాలు కలెక్టర్‌కు ఉన్నాయని అన్నారు. ఈ విషయంలో ప్రతి సీనియర్ సిటిజన్ నేరుగా జిల్లా మెజిస్ట్రేట్‌కు వినతిపత్రం సమర్పించాలని సూచించారు. తర్వాత కలెక్టర్ ఆర్డీవోను విచారించి రిపోర్టు తీసుకొని చర్యలకు పోలీస్ కమిషనర్‌ను ఆదేశిస్తారని చెప్పారు. చట్ట ప్రకారం తల్లిదండ్రులకు ఆహారం, నివాసం, వైద్య ఖర్చులు తదితర సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత వారి పిల్లలదేనన్నారు. సీనియర్ సిటిజన్ చట్టం 2007 చాలా శక్తివంతమైందని, వృద్ధులకు ఇబ్బందులు ఎదురైతే తనను సంప్రదిస్తే పరిష్కారం చూపిస్తానని అన్నారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య సమస్యలుంటాయని, ఏ అధికారిని కలిసేందుకు వెళ్ళినా ముందుగా అవకాశం కల్పించాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలను విసుక్కుంటే అర్థం చేసుకొని గౌరవం ఇవ్వాలని, ఎదురు తిరుగకూడదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, ఉపాధ్యక్షులు మోసం అంజయ్య, ఉప్పల రామేశం, సంయుక్త కార్యదర్శులు రాజూచందర్, శ్రీధర్‌స్వామి, కోశాధికారి చింతల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి లక్ష్మి, రామకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, మేనేజర్ జీఎస్ ఆనంద్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయాధికారి కె వెంకటేష్

నేడు కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

కరీంనగర్ టౌన్, ఆగస్టు 21: కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయి ఎలో రుణాలను మాఫీ చేయక పోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురు వారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి పాల్గొంటారన్నారు. పార్టీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, ప్రజాప్రతి నిధులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు, పారీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని హరిశంకర్ కోరారు.

డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి బదిలీ

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 21: జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను నిర్మల్ జిల్లా క్రీడాశాఖ అధికారిగా బదిలీలి చేస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లా క్రీడాశాఖలో స్విమ్మింగ్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న వి శ్రీనివాస్‌ను జిల్లా యవజన క్రీడాశాఖ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కుమారుడి మరణాన్ని తట్టుకోలేక తల్లి ఆత్మహత్య



గడ్డి రాజయ్య (ఫైల్)



గడ్డి కనకమ్మ (ఫైల్)

శంకరపట్నం, ఆగస్టు 21: కన్న కొడుకు మరణాన్ని చూసి తట్టుకోలేక ఓ తల్లి మనస్తాపం చెంది వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. శంకరపట్నం మండలం మెట్‌పల్లికి గడ్డి రాజయ్య (40) అనారోగ్యంతో మృతి చెందగా, అతడి తల్లి గడ్డి కనకమ్మ (70) బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గడ్డ కనకమ్మ భర్త మల్లయ్య ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వారి చిన్న కుమారుడు రాజు దివ్యాంగుడు. తల్లి కనకమ్మే అతడి బాగోగులు చూసుకునేది. బుధవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మనస్తాపం చెందిన కనకమ్మ ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బావిలో నుంచి కనకమ్మ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతికి సంబంధించి విచారణ చేపట్టారు. కనకమ్మ పెద్ద కొడుకు గడ్డి సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వర్గీకరణ తీర్పుపై పునరాలోచించాలి

- మాలల జేఏసీ నాయకుల డిమాండ్
- భారత్ బంద్ సక్సెస్



కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న మాలమహానాడు కార్యకర్తలు

సుభాష్‌నగర్, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల పునరాలోచించాలని మాలల జేఏసీ నాయకులు కోరారు. బుధవారం మాలల జేఏసీ ఆధ్వర్యంలో భారత్‌బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, వ్యాపారాల సంస్థలు, హోటళ్లను మూసి వేయించారు. నగరంలో ర్యాలీలు నిర్వహించారు. అడ్వకేట్లు ర్యాలీ నిర్వహించారు. బస్సులను మాల జేఏసీ నాయకులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయడం రాజ్యాంగ వ్యతిరేక మన్నారు. పార్లమెంట్‌లో తీర్మానం లేకుండా, ఆర్టికల్ 341ను సవరించే అధికారం ఎవరికి లేదన్నారు. ప్రధాని మోదీ మనువాద వారసుడిలా ఈ దేశంలోని దళితుల అనైక్యతకు ఆజ్యం పోస్తున్నాడని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తూ, ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతున్న పార్టీలు పునరాలోచన చేయాలన్నారు. రాజ్యాధికారాన్ని దూరం చేసే వర్గీకరణ వాదాన్ని బొందపెట్టాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కాడ శంకర్, మేడి మహేశ్, మేడి అంజయ్య, బొగ్గుల మల్లేశం, బోలుమల్ల సదానందం, గంట శ్రీనివాస్, దామెర సత్యం, తాళ్ళ వెంకన్న, మండిగ మాణిక్యరావు, గంటల రేణుక, ఆశ విజయ, దండి రవీందర్, బండ అనిత, శీలం పుష్పలత, గంటల మహేందర్, మేకల రజని, జక్కుల లలితప్రసన్న, నాయిని ప్రసాద్, పులి సుధీర్, గూడ కమలాకర్, దానుక ప్రవీణ్, కొత్తపల్లి జనార్దన్, కిషోర్, జంగా అపర్ణ, సింగదాసరి నారాయణ, రతన్, రాజు రవి, మనోహర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు



వినియోగదారులతో మాట్లాడుతున్న టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ ఛైర్మన్ వేణుగోపాలచారి

చొప్పదండి, ఆగస్టు 21: మండల పరిధిలోని ఆర్నకొండ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులు ఓవర్ లోడ్, లోవోల్టేజీ, ట్రాన్స్‌ఫర్మర్ల అంశాలపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల స్వీకరించిన టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ ఛైర్మన్ వేణుగోపాలచారి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాగంపేటలోని సింగిల్ ఫేజ్ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను మూడు ఫేజుల ట్రాన్స్‌ఫార్మర్లుగా మార్చాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాగం పేట రైతులు విజ్ఞప్తి చేశారు. ఆర్నకొండలో 440 కేవీఏ లైన్ కింద గల విద్యుత్ లైన్‌లు ఉన్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు, రమేష్, చరణ్‌దాస్, నరేందర్, ఆర్నకొండ మాజీ సర్పంచ్ దామెర విద్యాసాగర్‌రెడ్డి, మాజీ కారోబార్ అంజయ్య, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలుపు నివారణపై అవగాహన

భగత్‌నగర్, ఆగస్టు 21: వ్యవసాయపరిశోధన స్థానం కరీంనగర్‌లో వయ్యారి భామ కలుపు నివారణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. . ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి మంజులత మాట్లాడుతూ వయ్యారి భామ అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క అని తెలిపారు. అత్యంత సులభంగా వ్యాపిస్తూ ఏపుగా పెరిగి పంటలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ మొక్కతో పంట దిగుబడి తగ్గుతుందని, ప్రజల, పశువుల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుందన్నారు. రైతులందరూ ఈ మొక్కలు పూత పూయక ముందే వేర్లతో సహ పీకి బురదలో తొక్కి వేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జి ఉషారాణి, డి శ్రావణి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కె మదన్‌మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, కరీంనగర్, సిరిసిల్ల రావెప్ విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టబద్ధమైన పని విధానాలు రూపొందించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 21: దేశవ్యాప్తంగా పనిచేస్తున్న మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పనివిదానాలు రూపొందించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్ధమైన పని విధానాల కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. తమ పోరాటాలకు దిగివచ్చిన కేంద్రం, 2007 ఆగస్టు 10న డ్రాఫ్ట్ రూల్స్ మాత్రమే రూపొందించిందన్నారు. ఈ డ్రాఫ్ట్ రూల్స్‌పై యూనియన్ ద్వారా అభ్యంతరాలు తెలుపగా ఇంతవరకు ఎలాంటి రూల్స్‌ను రూపొందించలేదన్నారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్-1976ని ఉల్లంఘిస్తున్న ఫార్మా యాజమాన్యాలను శిక్షించాలని, కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎ సదానందచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండా శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు జేఎల్ నరసింహరెడ్డి, సహాయ కార్యదర్శులు పి నరేందర్, కె సంపత్‌రెడ్డి, పి హరీష్, డి శ్రీనివాస్, ఆనంద్, కె శ్రీనివాస్, దేవరాజ్ పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు

వసతి గృహాల్లో అక్రమాలపై
సమగ్ర విచారణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంద గణేశ్

గణేశ్‌నగర్, ఆగస్టు 21: జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి సంద గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాల్స్ కొంతమంది ఉన్నతాధికారులతో కుమ్మక్కయి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా అవినీతికి పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించ కుండా, కాస్మోటిక్స్ చార్జీలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసి సమగ్ర విచారణ జరపాలన్నారు. నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అను గుణంగా మెస్, కాస్మోటిక్స్ చార్జీలను పెంచాలని డిమాండ్‌చేశారు. లేకపోతే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు గణేష్, సంపత్, తిరుపతి, కుమార్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 21: రైతులను రుణవిముక్తులను చేయడంతోపాటు రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని రుణవిముక్తులను చేసేందుకు వరంగల్ డిక్లరేషన్ సభలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా అధికారంలోకి వచ్చిన కేవలం 8-9 మాసాల్లోనే రైతు రుణమాఫీ చేసి చూపించిందన్నారు. ఇప్పటికే జూలై 18నుంచి ఆగస్టు 15వరకు 18వేల కోట్ల రూపాయలతో రెండు లక్షల లోపు రుణం ఉన్న రైతుల రుణాలను మాఫీ చేసిందని తెలిపారు. సాంకేతి కారణాల వల్ల కొందరు రైతులకు మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందు తున్నారని, తమ ఆధార్ కార్డు ద్వారా రుణమాఫీ అర్హత తెలుసుకొని సమ స్యను పరిష్కరించుకోవడం ద్వారా మాఫీ వర్తిస్తుందన్నారు. రెండు లక్షల పైచిలుకు రుణాల్లో కూడా ఆపై మొత్తాన్ని చెల్లించి రెండు లక్షల వరకు రుణం పొందే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏక కాలంలో రూ.1లక్ష రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వానికి రైతు రుణాలను మాఫీ చేయాలనే ఆలోచన లేకపోవడం దురదృష్టకరమన్నారు. కేవలం అంబానీ, అదానీల రుణవిముక్తికి కృషి చేస్తుంది తప్ప రైతు రుణాల మాఫీకి కాదన్నారు. రేషన్‌కార్డు లేని వారికి కూడా అధికారుల విచారణ అనంతరం మాఫీ వర్తిస్తుందని ఆందోళన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అర్హత ఉండి, సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని వారి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రతిపక్షాలు రైతులకు గైడ్‌గా నిలవాలి తప్ప, రెచ్చ గొట్టడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు విడతల్లో చేసిన లక్ష రూపాయల రుణమాఫీ పథకం కేవలం వడ్డీ మాఫీ పథకంగా మారిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్, బ్లాక్ ప్రెసిడెంట్ పొలాస నందయ్య, మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ ఎంపీపీ రమేష్‌బాబు, నాయకులు గుంటి జగదీశ్వర్, భాస్కర్‌రావు, షేక్ చాంద్ పాషా, పొగల్ల శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

గాంధేయ మార్గంలో

సామాజిక కార్యకర్త పాదయాత్ర

అభివృద్ధిపై సీఎంను కలిసేందుకు హైదరాబాద్‌కు పయనం

భగత్‌నగర్, ఆగస్టు 21:తమ ప్రాంత అభివృద్ధి పై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించుకునేందు కు ఓ సామాజిక కార్యకర్త గాంధేయమార్గంలో పాదయాత్ర చేపట్టాడు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణికి చెందిన పెందోర్ ధర్ము అనే సామాజిక కార్యకర్త గాంధీ వేషధారణతో పాదయాత్రగా బయలుదేరి కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధిపై విన్నవించేందుకు గాంధేయ మార్గంలో పాదయాత్ర చేపట్టినట్లు ధర్ము తెలిపారు.


మహాత్మాగాంధీ వేషధారణలో ధర్ము

పురుగుల మందు తాగి మహిళ మృతి


సరోజన (ఫైల్)

ఇల్లందకుంట, ఆగస్టు 21:మండలంలోని టేకుర్తికి చెందిన శ్రీరాముల సరోజన (58) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరోజన వారం రోజులుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తుంది.ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అదే రోజు రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. సరోజన భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

శంకరపట్నం, ఆగస్టు 21: మండలంలోని అంబాలపూర్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నాటు సార తయారీ స్థావరాలపై బుధవారం దాడి చేశారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ కరీంనగర్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. బెల్లం పానకం ధ్వంసం చేశారు. గొల్లెన కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు..: ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం: మండల కేంద్రం సమీపంలో కరీంనగర్- వరంగల్ రహదారిపై బుధవారం బైక్‌ను కారు ఢీకొంది. మండలంలోని ఆముదాలపల్లికి చెందిన ఆకునూరి తిరుపతిరెడ్డి బైక్‌పై వెళుతుండగా కారు ఢీకొట్టడంతో రోడ్డు పక్కకు పడిపోయాడు. తిరుపతిరెడ్డి కాలుకు తీవ్రగాయాలయ్యాయి.

టేకుచెట్ల నరికివేతపై డీఎఫ్‌వో విచారణ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో టేకు చెట్ల నరికివేతపై విచారణకు వెళ్లిన డీఎఫ్‌వో బాలమణి ఆధ్వర్యంలోని అధికారులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. అటవీ ప్రాంతంలోని నరికిన చెట్లను అధికారులు పరిశీలించి సోదాలు నిర్వహించారు. గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటిలో నిల్వ చేసిన పాత కలపను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధమవడంతో రైతులు

పోతిరెడ్డిపల్లిలో అధికారులను అడ్డుకున్న రైతులు

అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామ శివారులోని అటవీ సమీపాన ఉన్న 20 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 21 మందికి చెందిన పట్టా భూమిలోని టేకు చెట్లను గత యేడాది నరికి వేస్తే ప్రస్తుతం కలపను ఎందుకు స్వాధీన పర్చుకుంటారని అధికారులను నిలదీశారు. సుమారు మూడు గంటల పాటు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. రైతులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఓ వ్యక్తి ఇంటిలో నిల్వచేసిన పురాతన కలపను స్వాధీన పర్చుకుంటామని అటవీశాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కలపను తరలిస్తే ఊరుకోబోమని అడ్డుకున్నారు. అటవీశాఖ అధికారులు ఇతర గ్రామం నుంచి వాహనాన్ని తీసుకువచ్చి కలపను సిరిసిల్ల అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కలప విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. అనుమతి లేకుండా టేకు చెట్లను నరికితే చట్టత్యా చర్యలు తప్పవని డీఎఫ్‌వో బాలమణి హెచ్చరించారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి)/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,067 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.276 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 17 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.59 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.66 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి 3,200క్యూసెక్కుల నీటిని ఒక పంప్ ద్వారా ఎత్తిపోస్తుండగా సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు నీటి విడుదలను నిలిపివేశారు.

మద్యం మత్తులో యువకుడి హత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21: మద్యం మత్తులో గొడవతో కరీంనగర్ అశోక్‌నగర్‌లోని దుర్గమ్మగడ్డ ఉర్దూమీడియం స్కూల్ ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న భవనం మూడో అంతస్థులో అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ ముజాయిద్‌ఖాన్ (32) మంగళవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. ముజాయిద్‌ఖాన్‌ను అశోక్‌నగర్‌కు చెందిన మీర్జా సుఫియాన్‌బేగ్ హత్య చేశాడని కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. సీఐ, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ముజాయిద్‌ఖాన్‌కు వివాహం జరిగినప్పటికీ భార్య అతడితో కలిసి ఉండడం లేదు. ఆటో నడుపుతూ, పూలు అమ్ముతూ జీవిస్తున్న ముజాయిద్ ఖాన్ ఒంటరిగానే అశోక్‌నగర్‌లో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి బంధువుల వద్ద భోజనం చేసిన ముజాయిద్‌ఖాన్ మద్యం సేవించి దుర్గమ్మగడ్డలోని స్కూల్ భవనంపై ఇసుకలో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో అక్కడే సమీపంలో హోటల్‌లో పని చేస్తున్న మీర్జాసుఫియాన్‌బేగ్ అదే భవనంపైకి చేరుకుని నిద్రకు ఉపక్రమించాడు.


ముజాయిద్‌ఖాన్ (ఫైల్)

మద్యం విషయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ముజాయిద్ ఖాన్ ముఖంపై సిమెంట్ ఇటుకతో మీర్జా సుఫియాన్‌బేగ్ బాదాడు. తల, ముఖంపై తీవ్ర రక్త గాయాలతో ముజాయిద్ ఖాన్ అక్కడికక్కడే మరణించాడు. అయితే ఈ విషయాన్ని నిందితుడు స్థానికులతో రాత్రి చెప్పాడని, అయినప్పటికీ మద్యం మత్తులో అలాగే మాట్లాడుతాడని భావించారని పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం నిందితుడు తాను ఒకరిని హత్య చేశానని తన తండ్రికి చెప్పగా వెంటనే స్థానికులు భవనంపై చూడగా ముజాయిద్‌ఖాన్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సరిలాల్ వెంటనే మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రపరిచారు. అనంతరం విచారణ జరుపుతున్నారు. కాగా మృతుడు, నిందితుడు ఇద్దరు కూడా పాత నేరస్థులుగా తెలిసింది. హత్య చేసిన నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మద్యం మత్తులో చిన్న కారణంతో గొడవకు దిగగా హత్యకు దారితీసిందని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సరిలాల్ తెలిపారు.

సైబర్ నేరాల కోసం పాత ఫోన్ల కొనుగోలు

● ముగ్గురు వ్యక్తుల అరెస్టు ● నాలుగు వేల మొబైల్ ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్న సైబర్ పోలీసులు


మహ్మద్ షమీమ్, అబ్దుల్ సలాం, మహ్మద్ ఇష్తికార్

కోల్‌సిటీ, ఆగస్టు 21: సైబర్ నేరాల్లో వినియోగించేందుకు పని చేయని పాత మొబైల్ ఫోన్లను అక్రమంగా కొనుగోలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు రామగుండం పోలీస్ కమిషనరేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం గోదావరిఖని, మేడిపల్లి ఎన్టీపీసీ ఏరియాలో బీహార్‌కు చెందిన కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ సైబర్ నేరాల కోసం పాత మొబైల్ ఫోన్లను తక్కువ ధరకు ప్రజల నుంచి ప్లాస్టిక్ వస్తువులు లేదా డబ్బును ఇచ్చి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ఈ సమాచారం రామగుండం సీసీపీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిబ్బందికి అందగా సీసీపీఎస్ ఎస్‌హెచ్‌వో కృష్ణమూర్తి సిబ్బందితో వెళ్లి అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. బీహార్‌లోని హతియా దియారాకు చెందిన మహ్మద్ షమీమ్(30), అబ్దుల్ సలాం (28), మహ్మద్ ఇష్తికార్(32)ల నుంచి సుమారు 4వేల పాత మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. రామగుండం, దాని చుట్టు పక్కల ప్రాంతం నుంచి నెల రోజులలో బీహార్‌కు తరలించాలనే ఉద్దేశం తో నిందితులు ప్రజల నుంచి తక్కువ ధరకు పాత మొబైల్ ఫోన్లను కొనుగోలు చేస్తున్నారని, అట్టి మొబైల్స్‌ను తమ గ్రామంలో నివసిస్తున్న సహచరుడికి అప్పగిస్తారని విచారణలో వెల్లడైందన్నారు. అసోసియేట్ ద్వారా జార్ఖండ్ రాష్ట్రంలోని జమ్తారా, దియోఘర్ తదితర ప్రాంతాలకు చెందిన సైబర్ నేరస్థులకు ఈ మొబైల్ ఫోన్లు సరఫరా అవుతాయని పేర్కొన్నారు. సైబర్ నేరస్థులకు విక్రయించే ముందు వారి సహచరుడు అక్తర్ ఈ మొబైల్ ఫోన్ల సాఫ్ట్‌వేర్, మదర్ బోర్డు, ఇతర భాగాలను రిపేర్ చేసి సైబర్ నేరస్థులకు ఇచ్చేవాడన్నారు. ఈ సైబర్ నేరస్థులు రిపేర్ చేసిన ఫోన్లను ఉపయోగించి మోసపూరితంగా సంపాదించిన డబ్బును అక్తర్, వారు పంచుకుంటారన్నారు. వీరిపై 318(4), 319(2), 61(2) బీఎన్‌ఎస్, 106 బీఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ సెక్షన్ 66(డీ)ఐటీ యాక్ట్-2008 కింద కేసు నమోదు చేసి తెలిపారు.

ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మవద్దు...

ప్రజలు తమ పాత మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మవద్దని, ఇవ్వొద్దని ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి సూచించారు. పాత ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయిస్తే వాటిని సైబర్ మోసాలకు ఉపయోగించే అవకాశం ఉందని, డివైజ్ ఐడెంటిటీ కారణంగా అమ్మకందారులు కూడా నేరాలకు పాల్పడే అవకాశం ఉందని అనుమానిస్తున్నారన్నారు. ప్రజలు తమ పాత ఫోన్లను విక్రయించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఒక వేళ అమ్మితే అమ్మకం దారులు కూడా నేరస్తులుగా పరిగణించ బడుతారన్నారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు ఉన్న సంచులు

మల్లుపల్లి శివారులో చిరుత కలకలం

అడవి పంది పిల్లలపై దాడి

గంభీరావుపేట ఆగస్టు 21: రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లుపల్లి, గోరంటాల గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన బ్రిడ్జి సమీ పాన చిరుత అడవి పంది పిల్లలపై దాడికి తెగబడింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగినట్టు ఫారెస్టు అధికారులు ధ్రువీకరించారు. మల్లుపల్లి గోరంటాల మధ్య ఉన్న బ్రిడ్జి సమీప ప్రాంతంలో అడవిపంది పిల్లలను చిరుత చంపేసింది. ఆ ప్రాంతంలో చిరుత అడుగులతో పాటు చనిపోయిన అడవి పంది పిల్ల ఉండడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దమ్మన్నపేట, గోరంటాల, ముచ్చర్ల అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న వ్యవసాయ పొలాల వద్ద చిరుత దాడి చేస్తూ మూగజీవాలను చంపేస్తుంది. మండలంలో ఇప్పటికే వరుస సంఘటనలు జరిగి, ఐదుకు పైగా మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. మల్లుపల్లి, గోరంటాల మధ్య చిరుత సంచరిస్తుండడంతో సమీప గ్రామస్థులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీకి రికార్డు ఆదాయం

కరీంనగర్ రీజియన్‌లో రూ.9.63 కోట్ల రాబడి

భగత్‌నగర్, ఆగస్టు 21: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కరీంనగర్ రీజియన్‌కు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరిందని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్. సుచరిత తెలిపారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల్లో కరీంనగర్ రీజియన్‌కు 9 కోట్ల 63 లక్షల 46 వేల రూపాయల ఆదాయం సమకూరిందన్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోల్లో రీజియన్ వ్యాప్తంగా 12,18, 192 కిలోమీటర్ల మేర బస్సులను తిప్పామన్నారు. మొత్తం 17,09,620 మంది ప్రయాణికుల్లో 12,05, 396 మంది మహాలక్ష్మి ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారన్నారు. రీజియన్ వాప్తంగా ఆదాయాన్ని ఆర్జించుడంలో సహకరించిన ప్రయాణికులకు రీజినల్ మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత

జ్వరంతో వృద్ధుడి మృతి

గన్నేరువరం, ఆగస్టు 21: మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన పిట్టల రాజనర్సు (72) జ్వరంతో మృతి చెందాడు. రాజనర్సుకు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న డాక్టర్లచే చికిత్స చేయించుకున్నాడు. నాలుగు రోజులు గడిచినా జ్వరం తగ్గక పోవడంతో కుటుంబ సభ్యులు శనివారం రాత్రి కరీంనగర్‌కు తరలించారు. అప్పటికే జ్వర తీవ్రత పెరగగా ఇన్‌ఫెక్షన్ అన్ని అవయవాలకు సోకి మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


రాజనర్సు (ఫైల్)

కార్యదర్శిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 21: మండలంలోని జగ్గసాగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈర్నపల్లి ప్రశాంత్‌కుమార్ విధులకు ఆటంకం కలిగిస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... పంచాయతీ కార్యాలయంలో బుధవారం కార్యదర్శి విధులు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన బోజ్జ చిన్నయ్య కార్యాలయానికి వచ్చాడు. తమ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు కట్టడం లేదని పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగిస్తూ చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో పోలీసు స్టేషన్‌లో కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

కోరుట్ల రూరల్, ఆగస్టు 21: మండలంలోని మాదాపూర్‌లో బాలిక అదృశ్యంపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిప వివరాల ప్రకారం... మాదాపూర్ గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక బుధవారం ఉదయం నుంచి కనిపించకుండా పోవడంతో తన తల్లి కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలిక మంగళవారం రాత్రి సమయంలో తల్లితో కలిసి ఇంట్లోనే నిద్రించింది. వేకువ జామున నాలుగు గంటల సమయంలో తల్లి నిద్ర నుంచి లేచి చూడగా తన కుమార్తె కనపడక పోవడంతో తమ సమీప బంధువులకు సమాచారం అదించింది. దీంతో బంధువులు పలు గ్రామాల్లో బాలిక కోసం వెతికారు. బాలిక కనపడక పోవడంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఎనుగంటి మూర్తి, అల్లెపు మహేందర్‌తో పాటు మరికొందరు తన కూతురిని అపహరించినట్లు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 21: మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వేగురుపల్లికి చెందిన కనకుంట్ల కార్తీక్ తన భార్య మౌనికతో కలిసి సోమవారం రాఖీ పండగకు అత్తగారి ఊరైన చిన్నకల్వలకు వచ్చాడు. భార్యను వదిలిపెట్టి తిరిగి వేగురుపల్లి వెళ్లిపోయాడు. బుధవారం చిన్నకల్వలకు వచ్చి భార్య ఇంటికి వెళ్దామని చెప్పగా, ఆమె మరుసటి రోజు వెళ్దామని చెప్పింది. దీంతో మనస్థాపానికి గురై పెద్దపల్లి కంచర్‌బావి వద్ద పురుగు మందు తాగాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వ్యభిచార స్థావరంపై దాడి

● ఏడుగురు వ్యక్తులు అరెస్టు
● వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రకాష్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ఆర్ ప్రకాశ్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 21: జిల్లా కేంద్రంలో జన్మభూమినగర్ ఎల్ఐసీ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పట్టణ పోలీసులు దాడి చేశారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ఐదుగురు విటులను అరెస్టు చేశారు. ఏసీపీ ఆర్ ప్రకాశ్ తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

హమాలీవాడకు చెందిన శ్రీరామోజు కరుణాకర్ అనే వ్యక్తి రెండు నెలల క్రితం ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడని చెప్పారు. రెండు నెలలుగా వ్యభిచార గృహాన్ని నడిపి స్తున్నారన్నారు. దీని నిర్వాహణ కోసం శాతని శంకర్ అనే వ్యక్తిని మేనేజర్‌గా నియమించుకున్నాడని తెలిపారు. శంకర్ గతంలో పట్టణంలోని ఓ లాడ్జిలో పనిచేశాడని, సోషల్ మీడియాలో అమ్మాయిల ఫొటో లను, వారి నంబర్లను తెలుసుకొని వారిని ఇక్కడికి పిలిపించి వ్యభిచారం కొనసాగిస్తున్నారని అన్నారు. విటుడి వద్ద రూ.2వేలు తీసుకొని సగం మహిళలకు ఇచ్చి సగం నిర్వాహకులు తీసుకుంటున్నారని చెప్పారు.

అందులో భాగంగానే వారం క్రితం కరీంనగర్‌కు చెందిన ఓ మహిళ ఫొటోను సోషల్ మీడియా ద్వారా సంపాదించి శంకర్ ఆమెకు ఫోన్ చేశారు. ఆమెకు షార్ట్ ఫిలిమ్స్‌లో అవకాశం కల్పిస్తామని, డబ్బులు కూడా పెద్ద మొత్తంలో ఇప్పిస్తామని మంచిర్యాలకు రావాల్సిందిగా చెప్పాడని అన్నారు.. శంకర్ మాట నమ్మి ఆ మహిళ మంగళవారం రాత్రి మంచిర్యాలకు వచ్చి ఆ ఇంటికి వెళ్లిందని ఏసీపీ తెలిపారు. శంకర్ ఆమె ఫొటోను తనకు తెలిసిన మంచిర్యాల, బెల్లంపల్లి, సీసీసీ నస్పూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, శ్రీరాంపూర్ ప్రాంతాల వారికి పంపించాడన్నారు.

సమాచారం తెలుసుకున్న బెల్లంపల్లికి చెందిన కొప్పర్తి నవీన్, దేవ పోశమల్లు, రామకృష్ణాపూర్‌కు చెందిన గండి రమేశ్ హమాలీవాడకు చెందిన కొలిపాక రాజ శేఖర్, సీసీసీ నస్పూర్‌కు చెందిన గొల్లపల్లి శేఖర్‌లు రాత్రి 10 గంటల సమయంలో గెస్టుహౌస్‌కు చేరుకున్నారని అన్నారు. వారు ఒక్కొక్కరు రూ.2వేల చొప్పున శంకర్‌కు ఇచ్చారని తెలిపారు. శంకర్ వారిని ఆ మహిళకు చూపించి వీరే షార్ట్‌ఫిలిం మేకర్స్ అని పరి చయం చేయించాడని ఏసీపీ చెప్పారు. వీరికి అను కూలంగా ఉంటేనే షార్ట్‌ఫిలింలో అవకాశాలు కల్పి స్తారని శంకర్ చెప్పాడని అన్నారు. అందుకుగాను డబ్బులను కూడా ఇస్తారని ఆమెకు చెప్పగా దీంతో ఆమె అందుకు ఒప్పుకుందన్నారు. సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సీఐ బన్సీలాల్ సిబ్బందితో అక్కడికి వెళ్లి వారందరిని అదుపులోకి తీసుకున్నారని ఏసీపీ తెలిపారు. వీరి మొబైల్ ఫోన్లలో ప్రముఖుల నంబర్లు కూడా ఉన్నాయని ఏసీపీ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21: కొత్తపల్లి మండల పరిధిలోని మార్క్‌ఫెడ్ గోదాం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన కొట్యూరి అజయ్ (33) మృతిచెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. అజయ్ కుటుంబంతో కలిసి చింతకుంటలో నివాసం ఉంటూ సెంట్రింగ్ పనిచేస్తుండేవాడని తెలిపారు. అజయ్ మంగళవారం ఉదయం కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతంలో సెంట్రింగ్‌పనికి వెళ్ళి తిరిగి చింతకుంటకు తన బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వాగులు పొంగితే రాకపోకలు బంద్

● కల్వర్టులు, వంతెనలు లేక జనాల అవస్థలు ● ప్రతిపాదనల దశ దాటని వైనం


వాగు ప్రవాహంతో నిలిచిపోయిన రాకపోకలు

కథలాపూర్, ఆగస్టు 21: ప్రభుత్వాలు మారుతున్నా మారుమూల పల్లె వాసులకు రవాణా సదుపాయాలు మెరుగుపడక పోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో నేతలు రోడ్లు, వంతెనల నిర్మాణాలపై ఇస్తున్న హామీలు నెరవేరకపోవడం వారికి పల్లె వాసులపై ఉన్న చిత్తశుద్ధిని చెప్పకనే చెబుతోంది. ఎన్నో సార్లు తమకు రవాణా మెరుగుపరచాలని విన్న విస్తున్నా నాయకులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉండడమే కాకుండా వంతెనలు, కల్వర్టులు లేక ప్రజలు పడుతున్న కష్టాలు దారుణంగా ఉన్నాయి.

తుర్తి, తక్కళ్లపల్లి వాసుల అవస్థలెన్నో...

చందుర్తి, రుద్రంగి, కొడిమ్యాల, బీమారం మండలాల సరిహద్దుల్లో ఉన్న తుర్తి గ్రామానికి వెళ్లాలంటే అంబారి పేట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ కల్వర్టు నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుంటే రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోవాల్సి వస్తోంది. సమీప అడవుల్లోంచి నీరు పుష్కలంగా ప్రవహిస్తే రోజుల తరబడి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అదేవిధంగా తక్కళ్ళపల్లి-సిరికొండ వంతెన అర్ధాంతరంగా పనులు నిలిచిపోయిన కారణంగా వాగు పొంగితే కథలాపూర్ వైపు రాకపోకలు నిలిచిపోవాల్సిన దుర్గతి పట్టింది.

ఈ వంతెన పనులను కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించడంలో పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కల్వర్టులు నిర్మించి, వంతెన పూర్తి చేసి తమ అవస్థలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తక్కళ్లపల్లిలో నుంచి కాలినడకన వస్తున్న యువకులు


తోటి ఖైదీ బెయిల్ ఖర్చుల కోసం చోరీలు.. గోదావరిఖనిలో యువకుడి అరెస్టు



యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21: గోదావరిఖని ప్రాంతంలో తాళం వేసి ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్లలో చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లికి చెందిన దురిశెట్టి స్వామి నిరంజన్ (35) గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోని మిలీనియం క్వార్టర్స్, టూటౌన్ పరిధిలోని పోతనకాలనీలో దొంగతనాలు చేశాడు. డిగ్రీ పూర్తి చేసిన స్వామి నిరంజన్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తూ పలుమార్లు జైలుకు వెళ్లాడు. నిందితుడిపై 14 కేసులు ఉన్నాయి.

ఒక కేసులో భద్రాచలం సబ్ జైలులో ఉన్న సమయంలో రవీందర్ అనే తోటి ఖైదీతో పరిచయం ఏర్పడింది. తన భార్య గర్భిణి అని ఎలాగైనా తనను బయటకు తీసుకు రావాలని స్వామి నిరంజన్‌ను రవీందర్ కోరాడు. రవీందర్‌ను బయటకు తీసుకు వచ్చేందుకు అవసరమైన డబ్బు సమ కూర్చుకునేందుకు దొంగతనాలు చేయాలని స్వామి నిరంజన్ నిర్ణయించుకున్నాడు. ఈనెల 9న భద్రాచలం నుంచి గోదావరిఖనికి వచ్చి మిలీనియం క్వార్టర్‌లో తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు తులాల వెండి చోరీ చేశాడు. క్వార్టర్‌ల పార్కింగ్‌లో బైక్‌ను తీసుకుని కొత్తగూడెంకు వెళ్లాడు. వరంగల్ శివారులో బండిలో పెట్రోల్ అయిపోవడంతో అక్కడే వదిలి బస్సులో భద్రాచలం చేరుకున్నాడు. చోరీ చేసిన నగలను కొత్తగూడెంలోని ఫైనాన్స్‌లో కుదువపెట్టి వచ్చిన డబ్బులతో లాయర్‌ను మాట్లాడి రవీందర్‌కు బెయిల్ వచ్చేలా ఏర్పాట్లు చేశాడు. చోరీ చేసిన డబ్బులు అయిపోవడం, మళ్లీ డబ్బులు అవసరం పడడంతో స్వామి నిరంజన్ మళ్లీ దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 14న పోతనకాలనీలో సింగరేణి క్వార్టర్‌లలో రెక్కీ నిర్వహించి, చాలా క్వార్టర్‌లకు తాళాలు వేసి ఉండడాన్ని గమనించాడు.

అర్ధరాత్రి 12 గంటలకు ఒక క్వార్టర్ తాళం పగులగొట్టి రూ.5500 నగదు, మరో క్వార్టర్‌లో ఎనిమిది తులాల వెండితో పాటు ఫాస్ట్ ట్రాక్‌వాచ్, బ్లూటూత్ హెడ్‌సెట్ చోరీ చేశాడు. క్వార్టర్స్ పార్కింగ్ స్థలంలో ఉన్న బైక్‌ను చోరీ చేసి కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో చుంద్రుగొండ వద్ద బైక్ పాడవడంతో అక్కడే వదిలి పారిపోయాడు. తిరిగి చోరీ చేయడానికి బుధవారం పోతనకాలనీకి వచ్చిన స్వామినిరంజన్ పోలీసులకు పట్టుబడ్డాడు. టూటౌన్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై అటువైపు వచ్చిన స్వామి నిరంజన్ పోలీసులను చూసి తప్పించుకోబోగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో చోరీ కేసును తక్కువ సమయంలో ఛేదించి, చోరీలకు పాల్పడిన స్వామినిరం జన్‌ను పట్టుకున్న ఎస్సై వెంకటేష్, కానిస్టేబుల్ రమేష్, భార్గవ్, ప్రవీణ్, వెంకటేష్‌లను సీఐ అభినందించారు.

'బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి'


సత్యనారాయణ, రాజేశ్వర్‌రావును సన్మానిస్తున్న సంఘ బాధ్యులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 21: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని టిపియుఎస్ జిల్లాశాఖ డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యనిర్వాహకవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కె.రాజేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తపస్ రాష్ట్ర కార్యదర్శి, సభ్యత్వ అభియాన్ జిల్లా ఇంచార్జి వి.జగన్మోహన్‌రావు హాజరై మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తపస్ కృషిచేస్తుందని, పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేపట్టాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు కట్ట రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని, 54శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని అమలు చేయాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా, మండల కమిటీల బాధ్యులు సంపత్‌కుమార్, పోలు సత్యనారాయణ, రాజేశ్వర్‌రావు, నరసయ్య, ఎ.శ్రీనివాస్, రఘురాం, సత్యం, కె.హరిచరణ్, చంద్రశేఖర్, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, అంజయ్య, సతీష్‌కుమార్, రాజమౌళి, శ్రీనివాస్, మనోహర్, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులుపాల్గొన్నారు. అనంతరం సంఘానికి వివిధ హోదాల్లో గత కొన్ని సంవత్సరాలుగా సేవలందించి ఇటీవల పదవీ విరమణ పొందిన సంఘ బాధ్యులు పోలు సత్యనారాయణ, తాటి రాజేశ్వర్‌రావును సత్కరించారు.

కొడుకుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఓ తండ్రి

సుభాష్‌నగర్, ఆగస్టు 21: తన కన్న కొడుకు తనను, తన బిడ్డలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఆయనపై చర్య తీసుకొని రక్షణ కల్పించాలంటూ ఓ తండ్రి పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి గోడు వెళ్ళబోసుకొని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి' కరీంనగర్ కార్యాలయానికి వచ్చి తన గోడును వెళ్లబోసుకున్నాడు. ఆయన చెప్పిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తూరుకు చెందిన తాళ్ళ బాలయ్య(82)కు ఐదుగురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. ఆయనకు స్వగ్రామంలో రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కటికనపెల్లిలో ఐదు షటర్లతో కూడిన ఇల్లు కూడా ఉంది. ఆయన యోగక్షేమాలు కొడుకు చూడకపోవడంతో ఉన్న భూమిలో ఎకరం భూమిని తన కూతుళ్ల పేరుపై చేశాడు. అయితే ఆ భూమిలోకి వారు వెళ్లకుండా కొడుకు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని బాలయ్య ఆరోపిస్తున్నాడు. తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు.

స్థానిక సమస్యలపై నోరు మెదపని ఎమ్మెల్యే గంగుల

-మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్

భగత్‌నగర్, ఆగస్టు 21: స్థానిక సమస్యలపై ప్రభుత్వంపై నోరు మెదపకుండా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఉండటంలో అంతర్యం ఏమిటో స్పష్టం చేయాలని మాజీ డిప్యూటి మేయర్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలు ఓట్లేసి గెలిపించిన పాపానికి నమ్ముకున్న ప్రజలకు అందుబాటులో ఉండకుండా స్థానిక సమస్యలను గాలికి వదిలేసి విదేశీ పర్యటనలు, హైదరాబాద్-ఢిల్లీకి తిరగడం వరకే పనిగా మారిందన్నారు. బీఆర్ఎస్ నేతలు బీజేపీ పార్టీని, కేంద్రమంత్రిని విమర్శించడం ఆపి అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఎమ్మెల్యే గంగుల అసలు ఏ పార్టీలో ఉన్నది అర్థం కావడం లేదన్నారు. వెలిచాల రాజేందర్‌రావు పనికి మాలిన విమర్శలు చేస్తూ ఉనికి కోసం ఉబలాటపడే నాయకుడన్నారు. కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయించే దమ్ముందా అని మాజీ డిప్యూటి మేయర్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్ ప్రశ్నించారు. ఆసరా పింఛన్ల పెంపు, రైతులకు రుణమాఫీ, కల్యాణలక్ష్మి, తులం బంగారం, పేదలకు పక్కా ఇళ్లకు సంబంధించి ప్రకటన ఎప్పుడు విడుదల అవుతుందని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కొలగాని శ్రీనివాస్, బండ రమణారెడ్డి, పవన్ పాల్గొన్నారు.

మండల విద్యాధికారులను నియమించాలి

-డీటీఎఫ్ మాజీ కార్యదర్శి కోహెడ చంద్రమౌళి

మానకొండూర్, ఆగస్టు 21: మండల విద్యాధికారుల నియామకం చేపట్టి విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కోహెడ చంద్రమౌళి ప్రభుత్వాన్ని కోరారు. డీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలను సమర్థవంతంగా నిర్వహించిన ప్రభుత్వం అదే తరహాలో మండల విద్యాధికారులను నియమించాలన్నారు. ఇప్పటి వరకు నాలుగు విడుతల కరువు భత్యం 14.56 శాతం రావాల్సి ఉందని దాన్ని వెంటనే మంజూరు చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంమోహన్, మండల అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీల వివరాల సేకరణ

ఇల్లందకుంట, ఆగస్టు 21: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీల వివరాలను ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సేకరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీల పేర్లు, ఫోన్ నంబర్లు, విద్యార్హతలు, గ్రామం, బోర్డు, ఇంజక్షన్లు, సెలైన్ లాంటివి పెడుతున్నరా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో సుజాత ఆదేశానుసారం వివరాలు సేకరిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, యాంటిబయాటిక్స్, గ్లూకోజ్, ఇంజక్షన్లు, స్టెరాయిడ్స్ ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్ తెలిపారు.

పీఆర్టీయూ (టీఎస్) కమిటీ ఎన్నిక

హుజూరాబాద్, ఆగస్టు 21: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్టీయూ (టీఎస్) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు సహోదర్, రమేష్‌లు తెలిపారు. అధ్యక్షుడిగా టి మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా కేతిరి భాగ్యరేఖ, అసోసియేట్ అధ్యక్షుడిగా అరిగెల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కంకణాల భాస్కర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా సహీద సల్మా, కార్యదర్శిగా మమత, మహిళా కార్యదర్శిగా పద్మ ఎన్నికయ్యారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు


షానగర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

రామడుగు, ఆగస్టు 21: మండల పరిధిలోని షానగర్‌లో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఆర్ నీరజ, ఫార్మసిస్ట్ ప్రేమలత, ఏఎన్ఎం మధు, గ్రామ కార్యదర్శి అనిల్, ఆశవర్కర్ హెఫ్సిబా పాల్గొన్నారు.

● జమ్మికుంట: పట్టణంలోని ఐదో వార్డు వెంకటేశ్వరపల్లిలో వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ చందన ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్స్ సదానందం, రత్న కుమారి, వార్డు కౌన్సిలర్ పిట్టల శ్వేత, ఆశా కార్యకర్తలు సువర్ణ, సుజాత పాల్గొన్నారు.

● వీణవంక: మండలంలోని లస్మక్కపల్లిలో మద్దుల ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆదిత్య ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా వైద్యా శిబిరన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, కలువల శంకర్‌రెడ్డి, మొండయ్య, దాసారపు ఇసాక్, శ్రీను, మురళి పాల్గొన్నారు.

ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలి

-తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీజేపీ నాయకులు ధర్నా


కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు


హుజూరాబాద్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 21: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకు 2లక్షల వరకు రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేపి మండల శాఖ అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తు ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్ రాజుకు వినపతి పత్రం అందించారు. ఈసందర్భంగా తాళ్ళపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 2లక్షల రూపాయలు ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులతో చెలగాటం ఆడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అనంతరం వాటిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల రుణామాఫీలో కొర్రీలు పెట్టి క్షీరాభిషేకాలు నిర్వహించు కుంటున్నారన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రుణం తీసుకున్న 45శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని అన్నారు. ఎల్‌బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) లెక్కల ప్రకారం రుణమాఫీకి 49వేల 500 కోట్లు అవుతుందన్నారు. రాష్ట్ర క్యాబినెట్ కమిటీ 31వేల కోట్లు అవుతుందని చెప్పిందని, కానీ బడ్జెట్‌లో 26వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన రుణమాఫీ మొత్తం 17వేల 933 కోట్లు మాత్రమేనని అన్నారు. దీనిని బట్టి రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఎలాంటిదో బయపడిందని ఎద్దేవా చేశారు. రైతు భరోసా పథకం కూడా పక్కన పెట్టారని ఆయన విమర్శించారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఎకరాకు పంటకు 7,500 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్, నాయకులు పాశం తిరుపతి, మునిగంటి కుమార్, చిందం అశోక్, కమలాకర్, నారాయణ, తిరుపతి, సునీల్ యాదవ్, యండి అఫ్రోజ్, రమేష్, శ్రీనివాస్, రమేష్, కె మల్లయ్య, ఎన్ సచిన్, కె సురేష్, యం సంజయ్, కె కార్తీక్, యం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం హుజూరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. రైతు రుణమాఫీ కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో బింగి కరుణాకర్, ముత్యంరావు, కొండాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విజేందర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేత

కరీంనగర్ టౌన్, ఆగస్టు 21: నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్‌పాయ్‌ని కాంగ్రెస్ కార్పొరేటర్లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ళ ప్రసాద్, కాశెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య పాల్గొన్నారు. అలాగే పలువురు ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

●గణేశ్‌నగర్, ఆగస్టు 21: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్‌ని బుధవారం టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డీఈలు విజయేందర్‌రెడ్డి, రాజం, తిరుపతి, ఎస్సీ ఓ రాజేశం తదితరులు ఉన్నారు.

అందరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 21: అందరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ అన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో వాతావరణ మార్పులకు అనుగుణంగా విద్యార్థులలో పర్యావరణ స్ఫూర్తిని పెంపొందించడానికి క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్‌ను వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ ప్రారంభించారు. డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం హైదరాబాద్‌లో మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వాతావరణ మార్పులు వాటి ప్రభావంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేశారు. ఈ క్లబ్ ముఖ్య లక్ష్యం వాతావరణ మార్పుల పట్ల అవగాహన కల్పించడం మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రతిపాదించడం, విద్యార్థులను చైతన్యవంతులను చేయడం అన్నారు. కళాశాల ప్రాంగణాన్ని పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్యాంపస్ క్లబ్ విద్యార్థులతో పాటు వృక్ష శాస్త్ర అధ్యాపకులు రాధాకృష్ణ, పడాల తిరుపతి, తాహె హుస్సేన్, కళా జ్యోతి, స్వరూప రాణి, తాజుద్దీన్, బి తిరుపతి, దేవేందర్ పాల్గొన్నారు.

'రుణ మాఫీపై ప్రతిపక్షాల ఆరోపణలు అవాస్తవం'


మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 21: రైతు రుణ మాఫీపై ప్రతిపక్ష నాయకుల ఆరోపణలు అవాస్తవమని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. అధికారం పోవడంతో కేటీఆర్ ఆత్మన్యూనతతో బాధపడుతూ అప్పుడప్పుడు తుపాకి రాముడిలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం విలేకరుల సమావేశంలో నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే డిస్కో డ్యాన్సులు, బ్రేక్ డ్యాన్సులు చేసుకోండని కేటీఆర్ అనడం సరికాదన్నారు. సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని తరిమి కొడుతారని నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి రైతుల సంక్షేమాన్ని పట్టించుకోని వారు రుణమాఫీపై ధర్నాలు ఎలా చేస్తారని నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయక పోవటంతోనే ప్రజలు కేసీఆర్‌కు ఎన్నికలలో గుణపాఠం చెప్పి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వాన్ని గద్దెనెక్కించారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజల ఆదరణ చూరగొంటుంటే గిట్టలేని కేటీఆర్, ఇతర నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్‌గాంధీ కుటుంబంపై విమర్శలు చేసే నైతికత కేసీఆర్, కేటీఆర్‌లకు లేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీని ఆనాడు మెచ్చుకున్న కేసీఆర్ కుటుంబం ఇపుడు విమర్శలు చేయటం వారికే చెల్లిందన్నారు. అనంతరం కరీంనగర్ టౌన్ ఏసీపీని కలిసి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఇతర నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎండి తాజ్, సమద్ నవాబ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, కుర్ర పోచయ్య, ఎండి చాంద్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దండి రవీందర్, లయక్, జీడి రమేష్, షబానా మహమ్మద్, మెరాజ్, సుదర్శన్, శిరీష్, కొట్టె ప్రభాకర్, మెతుకు కాంతయ్య, ముల్కల కవిత, తిరుమల, మహాలక్ష్మి, హసీనా, జ్యోతి రెడ్డి, రజితారెడ్డి, అష్రఫ్, ఖలీల్, రాజ్ కుమార్, పెద్దిగారి తిరుపతి, షేహెన్షా, బషీర్, జిలకర రమేష్, ఆంజనేయులు, ఇమ్రాన్, యోన, హనీఫ్, బషీర్, కీర్తి కుమార్ తది.తరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం



మానకొండూర్ రాస్తారోకో నిర్వహిస్తున్న మాల మహానాడు నాయకులు, గంగాధరలో బైక్ ర్యాలీ

సుభాష్‌నగర్, ఆగస్టు 21: ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లను కాపాడుకునేందుకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రాంచంద్రం అన్నారు. బుధవారం నిర్వహించిన భారత్‌బంద్‌లో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును పునఃసమీక్ష చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జీలు మంద బాలయ్య, అక్కి బాలకిషన్, కల్లెపెల్లి రాజేందర్, జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ పాల్గొన్నారు.

● చొప్పదండి: ఎస్సీఎస్టీల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ చొప్పదండిలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా చొప్పదండిలో మాలమహానాడు నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు కునమల్ల చంద్రయ్య, పిట్ట మనోహర్, నల్లాల అఖిల్, యశోద రాజయ్య, పురుషోత్తం కనకయ్య, కల్లె రాజు, కళ్లెం నవీన్‌కుమార్, ఈసారపు అజయ్ పాల్గొన్నారు.

● మానకొండూర్: మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం మానకొండూర్‌లో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొల్లం వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, బొల్లం రామస్వామి, వెల్పుల వెంకట్రాజం, తడకపల్లి నారాయణ, మల్లేశం, నారాయణ, సందీప్, సంపత్ పాల్గొన్నారు.

● గన్నేరువరం: మండలంలో మాల మహానాడు ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనుమాండ్ల మల్లేశం, నాయకులు సుధాకర్, రాజేందర్, దామోదర్, రమేష్, సాగర్ పాల్గొన్నారు.

● గంగాధర: మండలం కేంద్రలో మాల మహానాడు నాయకులు, భీం ఆర్మీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్ల సురేష్, తాళ్ల శ్రీనివాస్, స్వామి, పౌల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 21: విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే అద్భుత భవిష్యత్తు ఉంటుందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్‌లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెప్టెన్ లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థులకు స్వేచ్ఛ ఉంటుందన్నారు. విద్యార్థులు జీవితంలో స్థిరపడేందుకు కావాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కళాశాలలో అన్ని రకాల సదుపాయాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్, కళాశాల సెక్రెటరి వొడితల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

'రుణమాఫీపై ఆందోళన చెందవద్దు'

హుజూరాబాద్, ఆగస్టు 21: రైతులు రుణమాఫీపై ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ మాఫీ వర్తిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు లక్షల వరకు తీసుకున్న రైతులకు విడతల వారీగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాలతో కొందరికి డబ్బులు పడలేదని చెప్పారు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

'జ్యోతిష్మతి'లో మియావాకి ఫారెస్ట్ ప్లాంటేషన్


విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న సాగర్‌రావు

తిమ్మాపూర్, ఆగస్టు 21: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో మియావాకి ఫారెస్ట్ ప్లాంటేషన్ నిర్వహించారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'జ్యోతిష్మతి' చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సాగర్‌రావు మాట్లాడుతూ పర్యవరణాన్ని పరిరక్షణలో భాగంగా మియావాకి ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటి సంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు తమ ఇంజనీరింగ్ పూర్తయ్యే వరకు మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకుంటారని తెలిపారు. కార్యక్ర మంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ సుమీత్ సాయి, ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీన్ పీకే వైశాలి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి రూ.40 వేల పుస్తకాల అందజేత

హుజూరాబాద్, ఆగస్టు 21: పట్టణంలోని గ్రంథాలయానికి హెల్త్ ఫౌండేషన్‌ఎస్ఆర్ఐ సంస్థ తరుపున డాక్టర్ బీఎస్‌రావు పోటీ పరీక్షలకు సంబంధించిన 40 వేల రూపాయల విలువైన పుస్తకాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఎస్ రావు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పుస్తకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి లక్ష్మి, జనార్దన్, రత్నం, అంజనేయరావు, డాక్టర్ రామలింగారెడ్డి, టి శ్రీనివాస్, జి శ్రీనివాస్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆరె కటిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా నారాయణ

సుభాష్‌నగర్, ఆగస్టు 21: ఆరె కటిక కుల సంఘం జిల్లా, పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గజబింగార్ నారాయణ, పట్టణ అధ్యక్షునిగా హేరేకార్ మధు, యూత్ అధ్య క్షునిగా గోటికార్ హుస్సేన్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటికార్ ప్రకాశ్, గౌరవ అధ్యక్షుడు రావులేకార్ అశోక్, మిర్యాల్‌కార్ కిషన్, గోటికార్ మల్లయ్య గోటికార్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'సాంకేతిక కారణాలతో రుణమాఫీ ఆలస్యం'

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 21: సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి రుణమాఫీలో ఆలస్యం జరుగుతున్నదని, అలాంటి వారికి రుణాన్ని మాఫీ చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2 లక్షల రూపాయల వరకు రుణాలు తీసుకున్న రైతులకు ఇప్పటికే విడతల వారీగా వారి ఖాతాలో ప్రభుత్వం డబ్బులు జమ చేసిందని, మళ్లీ రైతులు రుణాలు తీసుకునేలా అవకాశం కల్పించిందని చెప్పారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

భగత్‌నగర్, ఆగస్టు 21: బీజేపీ రాష్ట్ర సభ్యత్వ నమోదులో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను జిల్లా బీజేపీ నాయకులు కలిసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు నిర్మలరెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి, జిల్లా నాయకులు సంతోష్, జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి ఎర్రోళ్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 21: ప్రతి ఉద్యోగికి పదోన్నతులు, బదిలీలు, పదవీ విరమణ సహజమని, అంకితభావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్) ప్రిన్సిపాల్ వి.సత్యవర్దన్‌రావు అన్నారు. బుధవారం కళాశాలలో తొమ్మిది మంది లెక్చరర్లు, ఒక అటెండర్ బదిలీ కాగా, వారి స్థానంలో ఐదుగురు లెక్చరర్లు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్ రావు అధ్యక్షతన ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్ళిన వారిని, బదిలీపై వచ్చిన వారిని సన్మానించి, నిబద్ధతతో విధులు నిర్వహించి పేరు తెచ్చుకోవా లని సూచించారు. జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల సంఘం అధ్యక్షుడు శశిధర్‌శర్మను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.ప్రమీల, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి కేంద్ర మంత్రి పరామర్శ

భగత్‌నగర్, ఆగస్టు 21: కరీంనగర్‌కు చెందిన విలేకరి మహేందర్‌ను హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. యశోద ఆసుపత్రిలో కొద్ది రోజులుగా గులియన్ బ్యారో సిండ్రోమ్‌తో బాధపడుతున్న మహేందర్ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

రెనే ఆసుపత్రిలో అరుదైన గుండె శస్త్రచికిత్స

సుభాష్‌నగర్, ఆగస్టు 21: రెనే ఆసుపత్రిలో అరుదైన గుండె శస్త్రచికిత్స నిర్వహించారు. పదిరోజుల శిశువు పుట్టుకతోనే గుండెకు రంధ్రం ఉంది. నగరంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రిలో ఉన్న శిశువును రెనే ఆసుపత్రిలో చేర్పించారు. రెనే ఆసుపత్రి చిన్నపిల్లల గుండె వైద్యనిపుణుడు డాక్టర్ రాజా విజేందర్‌రెడ్డి పరీక్షించాడు. 900 గ్రాములున్న శిశువుకు ఆపరేషన్ నిర్వహించాడు. గతంలో 1,200 గ్రాములున్న శిశువుకు ఆపరేషన్ విజయవంతగా నిర్వహించామని డాక్టర్ రాజావిజేందర్‌రెడ్డి తెలిపారు. 900గ్రాములున్న శిశువుకు పీడీఏ క్లోజర్ (గుండె రంధ్రానికి శస్త్ర చికిత్స) ఆపరేషన్ నిర్వహించడం ఇదే తొలిసారని అన్నారు. ఇపుడు రెనే ఆసుపత్రిలో పూర్తిస్థాయి గుండె సంబంధిత చికి త్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాటిమట్ల దినకర్, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ కృష్ణారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో న్యాయాధికారి పూజలు

ఇల్లందకుంట, ఆగస్టు 21: మండల కేంద్రంలోని సీతా రామచంద్రస్వామి దేవాలయంలో హుజూరాబాద్ రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గీదం స్వాతి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శేషం వంశీధరాచార్యులు ఆశీర్వచనం, స్వామి వారి చిత్రపటం అందజేశారు. అనంతరం న్యాయాధికారి స్వాతి శ్రీరామ సాయి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు.

పలు అంశాలకు మున్సిపల్ ఆమోదం

హుజూరాబాద్, ఆగస్టు 21: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం 18 అంశాలకు పాలకవర్గం ఆమో దం తెలిపింది. పట్టణంలోని కోనోకార్పస్ మొక్కలను తొల గించాలని కోరుతూ రవీందర్, ప్రభాకర్, సతీష్, కనకయ్య, రత్నం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికకు వినతి పత్రం సమర్పించారు. సమావేశంలో కమిషనర్ సమ్మయ్య, ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి ఎండీ బషీర్, సూపర్ వైజర్ అశ్వినిగాంధీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాలికలకు పలు అంశాలపై అవగాహన

రామడుగు, ఆగస్టు 21 : మండలంలోని వెదిర కేజీబీవీ పాఠశాల బాలికలలకు హైద్రాబాద్‌కు చెందిన వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రతినిధులు వివిధ అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమలో పాఠశాల ఎస్‌వో కవిత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

● వీణవంక: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 21: మండలంలోని పాపయ్యపల్లిలో శ్రావణ మాసం సందర్భంగా పోచమ్మ బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

30 నుంచి ఎస్జీఎఫ్ క్రీడల ఎంపిక పోటీలు

చొపcదండి, ఆగస్టు 21: ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలను 30 నుంచి సెప్టెంబరు 2 వరకు నిర్వ హిస్తున్నట్లు ఎంఈవో వేణుకుమార్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ వి భాగాల్లో నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎస్జీఎఫ్ సెక్రె టరీ కొమురోజు కృష్ణ, పీడీలు పాల్గొన్నారు.

'యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు'

తిమ్మాపూర్, ఆగస్టు 21: గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ కె స్వామి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మాదకద్రవ్యాలు, మైనర్ డ్రైవింగ్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆది త్య, హెడ్ కానిస్టేబుల్ గంగరాజు, బ్లూకోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.